మలుపు.. ముప్పు



ఆటోనగర్ బీ బ్లాక్ నుంచి ఎఫ్ బ్లాక్ మార్గంలో మలుపు

- ఆటోనగర్‌లో ప్రమాదకరంగా మలుపులు
- కానరాని హెచ్చరిక బోర్డులు
- హడలిపోతున్న వాహనచోదకులు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్‌లోని పలు ప్రాంతాల్లో మలుపులు ప్రమాదకరంగా ఉండటంతో వాహనచోదకులు హడలిపోతున్నారు. స్పీడ్ బ్రేకర్ గానీ, హెచ్చరిక బోర్డు గానీ లేకపోవడంతో ఆ ప్రాంతంలో మలుపు ఉందని దగ్గరకు వచ్చేవరకు తెలియడం లేదని, దీంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనచోదకులు చెబుతున్నారు. పైగా మలుపు ఉన్న ప్రాంతంలోనే రోడ్డుపై భారీ గోతులు ఉండటం కూడా ప్రమాదాలకు కారణమవుతోందని తెలియజేస్తున్నారు.

ఈ ప్రాంతాల్లో మరింత ముప్పు

– ఆటోనగర్ బీ బ్లాక్ నుంచి ఎఫ్ బ్లాక్‌కు వెళ్లే మార్గంలో మలుపు, ఈ బ్లాక్ నుంచి కూర్మన్నపాలెం వైపు వెళ్లే మార్గంలో మలుపు, 68వ వార్డు రాంనగర్ ఆటోనగర్ ఏ–బ్లాక్‌లో మలుపు, మింది నుంచి జింక్ వెళ్లే మార్గంలో జిల్లా పరిషత్ పాఠశాల ఎదురుగా గల మలుపు చాలా ప్రమాదకరంగా ఉన్నాయి. జింక్ వైపు నుంచి మిందికి వచ్చే మార్గంలో రాజీవ్‌నగర్ వద్ద మలుపుతో పాటు పలు ప్రాంతాల్లో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి.



మింది నుంచి జింక్ రోడ్డు వెళ్లే మార్గంలో జిల్లా పరిషత్ పాఠశాల వద్ద ఇలా..



జింక్ రోడ్డు నుంచి మిందికి వచ్చే మార్గంలో మలుపు

అలాగే, యువకులు మితిమీరిన వేగంతో రావడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు తెలిపారు. వేలాది వాహనాలు నిత్యం రాకపోకలు సాగించే ప్రాంతం కావడంతో అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



మలుపులు ప్రమాదకరంగా ఉన్న విషయం మా దృష్టికి రాలేదు. పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌లో ప్రమాదకరంగా ఉన్న మలుపుల వద్ద హెచ్చరిక వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేస్తాం. ముందుగా బీ బ్లాక్‌లోని ప్రధాన రోడ్డుతో పాటు అన్ని బ్లాకుల్లో మౌలిక వసతుల అభివృద్ధి పనుల తర్వాత దీనిపై దృష్టి సారిస్తాం.

– జయచంద్ర, ఆటోనగర్ ఐలా కమిషనర్

మలుపుల వద్ద ఎన్నో ప్రమాదాలు



ఆటోనగర్‌లో ప్రైవేట్ పనులు చేస్తుంటాను. మలుపుల వద్ద ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. నేను విధులు ముగించుకుని వెళ్లే సమయంలో మలుపుల వద్ద ప్రమాదానికి గురయ్యాను. మలుపు వద్దకు వచ్చేసరికి హఠాత్తుగా ఎదురుగా వాహనం వేగంగా రావడంతో గందరగోళానికి గురై ప్రమాదం జరిగింది. అధికారులు దృష్టి సారించి, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

– భాస్కరరావు, అక్కిరెడ్డిపాలెం

పవర్‌లిఫ్టింగ్ విజేతలకు సత్కారం



విజేతలను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు

పెదగంట్యాడ: పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జాతీయ స్థాయిలో రాణించి, బంగారు పతకాలు సాధించాలని గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆకాంక్షించారు. ఈ నెల 14, 15 తేదీల్లో అమలాపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులను మండలంలోని సత్య హెల్త్ కేర్ జిమ్‌లో గురువారం సత్కరించారు. జిమ్ అధినేత డాక్టర్ ఎస్.రాజారావు వద్ద శిక్షణ పొందిన కండిపల్లి తేజ 370 కిలోల విభాగంలో బంగారు పతకం, జి.రాము, కండిపల్లి నవీన్ రజత పతకాలు సాధించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, వైఎస్సార్ సీపీ గాజువాక పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి, న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ సీఐ దాలిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో సామర్థ్యం పెంపు



రసవత్తరంగా సాగుతున్న కబడ్డీ పోటీలు

అగనంపూడి : క్రీడల్లో జయాపజయాలకు ప్రాధాన్యత ఇవ్వొద్దని మండల విద్యాశాఖాధికారులు దివాకరరావు, గొంతిన సాయి శైలజ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) పరవాడ మండల స్థాయి కబడ్డీ బాలురు, బాలికల (అండర్–14, 17) పోటీలు అగనంపూడి నిర్వాసిత కాలనీ పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు స్ఫూర్తి కలిగించాలని, స్నేహ భావాన్ని పెంపొందించాలన్నారు. 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ ప్రావీణ్యం సాధించాలన్నారు. చదువులు, ఆటలను బ్యాలెన్స్ చేసుకొనే సామర్థ్యం క్రీడల వల్ల పెంపొందుతుందన్నారు. క్రీడా పోటీల్లో మండల పరిధిలోని 12 ఉన్నత పాఠశాలల నుంచి 2 వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ యలమంచిలి శ్రీను, నాయకులు పల్లా కార్తీక్, కర్రి దోశేంద్ర, బలిరెడ్డి సత్యనారాయణ, కిడిమి హనుమంతరావు, కోసూరి తాతారావు, సాలాపు అచ్చిబాబు, ఆశాలత, వెంకునాయుడు, అండిబోయిన మంగరాజు, మండలంలోని హైస్కూళ్ల ఫిజికల్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



నడుపూరు పాఠశాల ఆవరణలో చెత్త సేకరిస్తున్న గురప్ప తదితరులు

పెదగంట్యాడ: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని బీజేపీ 75వ వార్డు అధ్యక్షుడు గొందేశి గురప్ప అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిసరాలను గురువారం శుభ్రం చేశారు. విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నెల్లిముక్కు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యులు గొందేశి ఎరుకునాయుడు, ఎలమంచిలి అప్పలనాయుడు, ఎం.వెంకటనారాయణ, పల్లం కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛతాహీ సేవ



స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

అగనంపూడి : పరిశుభ్రతా కార్యక్రమంపై దువ్వాడ విజ్ఞాన్ ఫార్మా కళాశాల విద్యార్థులు దువ్వాడ రైల్వే ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫార్మా కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రైల్వేస్టేషన్ ఆవరణలోని చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే అనర్థాలు వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సత్యలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న యాక్సెప్ట్ ప్రతినిధులు

గాజువాక : హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్, హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు యాక్సెప్ట్ సంస్థ ప్రతినిధులు అవగాహన కల్పించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో యాక్సెప్ట్ ప్రోగ్రాం మేనేజర్ పద్మప్రియ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ ప్రశాంతి, యాక్సెప్ట్ ఫీల్డ్ ఆఫీసర్లు లక్ష్మి, రషీద్, జయమ్మ, రామలక్ష్మి, హారిక, ఏఎన్ఎం కరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

అరుంధతికి ఉత్తమ ప్రిన్సిపాల్ పురస్కారం



ప్రశంసాపత్రం అందుకుంటున్న అరుంధతి

అగనంపూడి: ఉత్తమ ప్రిన్సిపాల్‌గా విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అరుంధతి అవార్డును అందుకున్నారు. కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సీస్ (సీఎస్‌సీ) ఈ అవార్డును అందించింది. కళాశాలలో ఉత్తమ బోధన పద్ధతులు అవలంభించడం, నూతన విద్యావిధానాన్ని అమలు చేయడం, కళాశాలల విద్యార్థులు అంది పుచ్చుకుంటున్న ఉద్యోగావకాశాలను ప్రశంసించిన సీఎస్‌సీ ఈమేరకు ఆమెను ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ప్రకటించి, సత్కరించింది. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అండ్ ట్రైనింగ్ డీన్ మణేంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో సీసీక్యూసీ–2024 ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి కన్వెన్షన్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ చాప్టర్ కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ సర్కిల్ కాన్సెప్ట్స్ –2024 (సీసీక్యూసీ) గురువారం ప్రారంభమైంది. పెట్టుబడులు పెట్టడం, మెరుగైన భవిష్యత్తును నిర్మించడం అన్న అంశాలపై క్వాలిటీ సర్కిల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (క్యూసీఎఫ్ఐ) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న కన్వెన్షన్‌ను ఏటీసీ టైర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ బి. ప్రహ్లాదరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉత్పాదకతపై ప్రభావం చూపడానికి క్వాలిటీ సర్కిళ్లు ప్రత్యేక సాధనమన్నారు. ఫైజర్ డైరెక్టర్ కట్టా రవిచందర్ గౌరవ అతిథిగా హాజరై మాట్లాడుతూ మంచి భవిష్యత్తు కోసం నిపుణులపై పెట్టుబడి పెట్టాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ సీజీఎం జి. గాంధీ మాట్లాడుతూ ఒకరి నుండి మరొకరు నేర్చుకోవడానికి, సృజనాత్మక ఆలోచనల మార్పిడికి ఈ కన్వెన్షన్ మంచి వేదిక అవుతుందని అన్నారు. క్యూసీఎఫ్ఐ చాప్టర్ కార్యదర్శి ఎం.ఇ.సి.వి. సాగర్ మాట్లాడుతూ ఈసారి అత్యధికంగా 34 సంస్థల నుంచి ప్రతినిధులు హాజరు కావడంతో పాటు 129 కేస్ స్టడీలు సమర్పించనున్నట్లు తెలిపారు.

మెగా రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ బాగ్చి

గాజువాక : టీడీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల 6న నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరం పోస్టర్‌ను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. గత నాలుగేళ్లుగా తాము ప్రతి ఏడాది మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ నిర్వాహకుడు సనపల ఢిల్లీశ్వరరావు సీపీకి తెలిపారు. ఇప్పటివరకు 700 యూనిట్ల రక్తం సేకరించి, అవసరమైన వారికి అందజేశామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బి.గోవింద్, ఎం.అనిల్ కుమార్, చందు తదితరులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ ప్రారంభంలో ప్రోటోకాల్ రగడ

- కూటమి నాయకుల తీరుపై కార్పొరేటర్ నిరసన



కూటమి నాయకులను నిలదీస్తున్న కార్పొరేటర్ సుజాత

గాజువాక : గాజువాకలో అన్నా క్యాంటీన్ ప్రారంభోత్సవంలో ప్రోటోకాల్ వివాదం చోటు చేసుకుంది. 73వ వార్డు వుడా డబుల్ రోడ్‌లో ఏర్పాటు చేసిన ఈ క్యాంటీన్ ప్రారంభోత్సవానికి పలువురు కార్పొరేటర్లతో పాటు కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు హాజరయ్యారు. అయితే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హాజరు కాలేదు. దీంతో టీడీపీ కార్పొరేటర్లు దీన్ని ప్రారంభించడానికి ఉపక్రమించారు. 73వ వార్డు కార్పొరేటర్‌గా తాను ఉన్నందున క్యాంటీన్‌ను తాను ప్రారంభిస్తానని, ఎమ్మెల్యే రాని పక్షంలో ప్రోటోకాల్ ప్రకారం తానే ప్రారంభించాలని ఆ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత నాయకులతో పేర్కొన్నారు. ఇప్పుడున్నది కూటమి ప్రభుత్వమని, వైఎస్సార్‌సీపీకి సంబంధం లేదంటూ 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు సుజాత అభ్యర్థనను తిరస్కరించారు. జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావును రిబ్బన్ కట్ చేయాల్సిందిగా కోరుతూ ఆయనకు కత్తెర అందించారు. ఇది పార్టీ కార్యక్రమం కాదని, ప్రభుత్వ కార్యక్రమమని, అందువల్ల క్యాంటీన్ ప్రారంభోత్సవాన్ని తానే చేస్తానని సుజాత చెబుతున్నా కోన తాతారావు రిబ్బన్ కట్ చేసేశారు. దీంతో కూటమి నాయకుల తీరుపై సుజాత నిరసన వ్యక్తం చేశారు.

జెడ్సీ శేషాద్రి బాధ్యతల స్వీకరణ



గాజువాక : జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్‌గా బి.ఆర్.శేషాద్రి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ జోనల్ కమిషనర్‌గా పని చేసిన బి.సన్యాసినాయుడు తన మాతృసంస్థకు బదిలీ కావడంతో రేపల్లె మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న శేషాద్రి బదిలీపై ఇక్కడికి వచ్చారు. జోనల్ కార్యాలయంలోని వివిధ విభాగాల సిబ్బంది జెడ్సీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఇక్కడి అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు.

పోరాట యోధుడు సీతారాం ఏచూరి



సంతాప సభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గు నాయుడు

అక్కిరెడ్డిపాలెం : కార్మిక సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసిన మహా యోధుడు సీతారాం ఏచూరి అని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు అన్నారు. గురువారం భెల్ (హెచ్‌పీవీపీ) టౌన్ షిప్‌లోని బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద సంతాప సభ నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ స్వర్గీయ సీతారాం ఏచూరి ఎంపీగా దేశవ్యాప్తంగా ఉన్న పలు కర్మాగారాల కార్మికుల సమస్యలపై గళమెత్తిన మహోన్నత వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో ఇంటక్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు, నాయకులు అయోధ్యరామ్, పీవీఎన్ రాజు, జి.స్వామినాథన్, కొల్లి దేముడు, ఎస్.జ్యోతీశ్వరరావు, ప్రసాద్, సత్యవతి, హరి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలపై పోరాడే నాయకుడు నీరుకొండ



నీరుకొండ సత్కార సభలో మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ సీజీఎం శ్రీధర్

ఉక్కునగరం : ఉక్కు ఉద్యోగుల సమస్యలపై, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పోరాడే నాయకుడు స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు అని స్టీల్ ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఇన్‌చార్జి యు. శ్రీధర్ కొనియాడారు. ఇటీవల స్టీల్‌ప్లాంట్ నుంచి పదవీ విరమణ చేసిన నీరుకొండ రామచంద్రరావును స్టీల్ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ ఉద్యోగానికే కాని సేవలకు కాదన్నారు. ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ రామచంద్రరావు గుండెకు స్టెంట్ వేసుకున్న వారంలోనే పోరాటానికి వచ్చిన దమ్మున్న నాయకుడన్నారు. వివిధ కార్మిక సంఘాల నాయకులు డి. ఆదినారాయణ, యు. రామస్వామి, మాటూరి శ్రీనివాసరావు, కారు రమణ, వి. శ్రీనివాసరావు, కె. పరంధామయ్య, రామ్మోహన్‌కుమార్, మహాలక్ష్మినాయుడు, దాలినాయుడు, డి.వి. రమణారెడ్డి, ఇంటక్ జిల్లా నాయకులు బి. నాగభూషణం, భెల్ నాయకులు ఉరుకూటి బాబూరావు, ఎన్టీపీసీ నాయకులు పెంటారెడ్డి, ఐవోసీఎల్ నాయకులు సూరిబాబు, షిప్‌యార్డ్ నాయకులు మూర్తి, స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

అడ్‌హక్ కమిటీ నియామకం



అర్చకులకు బకాయి జీతాలు చెల్లిస్తున్న గ్రామ నాయకులు

అగనంపూడి : గత కొంత కాలంగా వివాదాలకు కేంద్రంగా మారిన 85వ వార్డు పెదమడక ఉమామహేశ్వరస్వామి ఆలయానికి అడ్‌హక్ కమిటీ నియమించారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో సమావేశమైన గ్రామ నాయకులు తాత్కాలిక కమిటీని నియమించారు. కొత్త కమిటీ ఏర్పాటు చేసే వరకు తాత్కాలిక కమిటీ ఆలయ నిర్వహణ బాధ్యత చూసుకుంటుందని గ్రామ నాయకులు నెల్లి శ్రీనివాసరావు, మోటూరి వెంకటరమణ చెప్పారు. అడ్‌హక్ కమిటీ ప్రతినిధులుగా గెద్దాడ సత్యనారాయణ, సోమేశ్వరరావు, లోవరాజు, సన్యాసిరావులను నియమించారు. తర్వాత ఆలయ అర్చకులకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జీతం మొత్తాన్ని గ్రామ కమిటీ నాయకులు చెల్లించారు. సన్యాసిరావు, గంతకోరు అప్పారావు, మజ్జి శ్రీను, దానబాల అప్పలనాయుడు, కొలిపాక అప్పారావు, పట్టా రామ అప్పారావు, గెద్దాడ అప్పలరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధి మెటీరియల్ బూడిద పాలు



మింది జెడ్పీ స్కూల్లో రాయిలా మారిన సిమెంట్ బస్తాలను చూపుతున్న అప్పలరామ్మూర్తి



తుప్పు పట్టిన ఐరన్ రాడ్లు

అక్కిరెడ్డిపాలెం : నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా మింది జిల్లా పరిషత్ హైస్కూల్లో పాఠశాల అదనపు గదుల నిర్మాణం చివరి దశలో వినియోగించాల్సిన సుమారు వంద బస్తాల సిమెంట్, ఐరన్ రాడ్లు నిరుపయోగంగా మిగిలాయి. దీనిపై వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ గుడివాడ అప్పల రామ్మూర్తి, గుడివాడ అప్పన్న మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధులు మండిపడుతున్నారు. అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలపై కక్ష గట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేసేందుకు రూ.10 లక్షలు మంజూరు చేస్తే అవి పూర్తై వినియోగంలో వచ్చి ఉండేవన్నారు. సిమెంట్, ఐరన్ వంటి మెటీరియల్ నిరుపయోగంగా మారడంపై ఎప్పటికప్పుడు విద్యాశాఖ, జీవీఎంసీ అధికారులకు సమాచారం ఇస్తూనే ఉన్నట్లు పాఠశాల హెచ్ఎం పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయ అన్నారు. సిమెంట్‌ను జాగ్రత్త చేశామన్నారు. మేస్త్రీలు, పనివారికి చెల్లింపులు జరగకపోవడంతో చివరి క్షణంలో పనులు జరగలేదని తెలిపారు.

అభివృద్ధి పనుల బోర్డుల ఆవిష్కరణ



బోర్డు ఆవిష్కరిస్తున్న గుడివాడ అప్పలరామ్మూర్తి

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మిందిలో గుడివాడ అప్పన్న మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టనున్న అభివృద్ధి పనుల బోర్డులను వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు గుడివాడ అప్పల రామ్మూర్తి ఆవిష్కరించారు. మింది బస్టాప్ వద్ద గల గుడివాడ గురునాథరావు ఆడిటోరియంలో మొత్తం అభివృద్ధి పనులకు సంబంధించి మూడు బోర్డులను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ హోమియోపతి హాస్పిటల్‌కు వసతి సౌకర్యం కల్పించడంతో పాటు ఫర్నిచర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. గ్రంథాలయ నిర్వహణతో పాటు విద్యుత్ బిల్లులు చెల్లించి ఫర్నిచర్ ఏర్పాటు చేయిస్తామన్నారు. వృద్ధులకు, ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు, గ్రామ ప్రజలకు షుగర్, బీపీ తదితర పరీక్షలు చేయిస్తామని తెలిపారు. మిందిలో సబ్ పోస్టాఫీస్ ఏర్పాటు, ఫర్నిచర్‌తో పాటు అవసరమైన పరికరాలను రూ.18 వేలతో సమకూరుస్తున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, ఒ.వెంకటరావు, ఈటి సురేష్, ఈటి శ్రీరాములు, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణకు 1 నుంచి రాష్ట్రవ్యాప్త ఆందోళన



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

అగనంపూడి : స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకునేందుకు వచ్చేనెల 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నామని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా 1316వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి ఆయువుపట్టు వంటి విశాఖ ఉక్కు ఆంధ్రుల సొత్తని, దాన్ని బడాబాబులకు అతి తక్కువ ధరకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకించే ప్రతి తెలుగు జాతీయుడు ఈ ఉద్యమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయాలు, ప్రాంతాలకు అతీతంగా చేపడుతున్న ఈ ఉద్యమానికి ఊతమివ్వాలని అభ్యర్థించారు. కేంద్రం మొండిగా ముందుకు వెళ్లాలని చూస్తే భవిష్యత్‌లో జరగబోయే పరిణామాలకు కేంద్ర పెద్దలే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కె.రాజబాబు, జె.రామకృష్ణ, బి.ఎం.ఎల్.నాయుడు, వి.ఎస్. వరప్రసాద్, దుర్గారావు, ఈశ్వరరావు, పి.వి.రమణ, ఎం.గోవిందరావు, జి.ఆనంద్, జాన్సన్, బొద్దపు రమణ, డి.అప్పలనాయుడు పాల్గొన్నారు.